


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| మంగళవారం 09 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 007 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# అభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్ మహానగర వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సీఎం రేవంత్ రెడ్డి

## హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం





సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 9, ప్రతినిధి: రాష్ట్ర అభివృద్ధినే ప్రధాన ఎజెండాగా తీసుకుని వచ్చే రెండున్నరేళ్ల పాటు తెలంగాణ వికాసం కోసం నిరంతరం కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవనంతో పాటు మొత్తం రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం మియాపూర్ క్రాస్ రోడ్స్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ మల్కాజిగిరి పరిధిలోని గాజుల రామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మాణం చేపడతామని, మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ మహానగరంలో మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, తెలంగాణ రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాయదుర్గం నుంచి నియోపోలిస్ వరకు మెట్రో విస్తరణ చేపడతామని తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ భవనాలను అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తామని పేర్కొన్నారు. నగరంలో పేదలకు లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకే సమీపంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని తెలిపారు. దేశంలోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై నగరాలు కాలుష్యం, ట్రాఫిక్, వరద సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో హైదరాబాద్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన విజన్‌తో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల 1.34 కోట్ల జనాభా నివసిస్తోందని, ప్రతి సంవత్సరం నగరం 3 శాతం వేగంతో విస్తరిస్తోందని చెప్పారు. సమన్వయం లేని పరిపాలన కారణంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, చెత్త నిర్వహణ, విద్యుత్, భద్రత వంటి అనేక సమస్యలు తలెత్తాయని, అందుకే 2100 చదరపు కిలోమీటర్ల పరిధిని మూడు కార్పొరేషన్లుగా విభజించామని వివరించారు. 150 డివిజన్లతో గ్రేటర్ హైదరాబాద్, 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని, వాటికి అనుగుణంగా పోలీస్ కమిషనరేట్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయ వివక్ష లేదని, ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడుకుందామని, అప్పటివరకు అన్ని రాజకీయ పక్షాలు అభివృద్ధికి సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 9, ప్రతినిధి: ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో నిర్వహించిన చివరి ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజా కోణంలో ఆలోచించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 9, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గద్వాల జిల్లా పరిధిలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని, మరో రెండు నుంచి మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో దక్షిణ మరియు తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పనులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు.

## గత ప్రభుత్వ భూవ్యవహారాలపై సీఎం చంద్రబాబు విమర్శలు



సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 9, ప్రతినిధి: భూసేకరణ మరియు ల్యాండ్ టైటిలింగ్ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం ప్రజలు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని, అక్కడ పెట్టుబడులకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. అయితే గోదావరి జిల్లాల్లో భూసేకరణ కొంత క్లిష్టంగా మారుతోందన్నారు. గోదావరి జిల్లాల ప్రజలు ప్రశాంత స్వభావం కలవారని, వివాదాలకు దూరంగా ఉంటారని వ్యాఖ్యానించిన సీఎం, గత ప్రభుత్వ హయాంలో అనేక మంది భూములు తారుమారయ్యాయని ఆరోపించారు. సహకరించని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చారని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని అడ్డగోలుగా అమలు చేసి, భూసర్వే పేరుతో భారీ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించిన చంద్రబాబు, భూముల రికార్డుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.



## పోసానిపేట్ గ్రామసభలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ మరియు ఈ-వెస్ట్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 9: అందోల్ మండలంలోని పోసానిపేట్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఈ-వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. గ్రామ సెక్రటరీ షాజహాన్ మేడం, సర్పంచ్ జి. గోపాల్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు వి. వెంకటేశం, నాగరాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా రీసైక్లింగ్‌కు పంపించాలని సూచించారు. అలాగే పాత మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి ఈ-వేస్ట్‌ను ప్రత్యేకంగా సేకరించి సంబంధిత కేంద్రాలకు అప్పగించాలని తెలిపారు. సానిటేషన్ మరియు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పోసానిపేట్ గ్రామ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 9, స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్‌హెచ్‌వోలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.



## ఎబోలా నివారణకు రాష్ట్రం అప్రమత్తం
## శంషాబాద్ విమానాశ్రయంలో పటిష్ట నిఘా
## తప్పుడు వివరాలు ఇస్తే కేసులు నమోదు

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 9, స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్: డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థ, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరాలు అందిస్తూ, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశీయ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఇద్దరు అనుమానితుల నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపగా, పరీక్షల్లో వారికి ఎబోలా వైరస్ లేదని నిర్ధారణ అయిందన్నారు. ఐసీఎంఆర్ మార్గదర్శకాల మేరకు మరోసారి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించినట్లు తెలిపారు. రెండోసారి కూడా నెగిటివ్ వస్తే వారిని డిశ్చార్జ్ చేయనున్నట్లు వెల్లడించారు. సాంపిల్స్ సేకరణ, పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ అధికారులను కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు అందాయని, పరీక్షలు ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. విదేశాల నుంచి వచ్చే కొందరు ప్రయాణికులు తప్పుడు చిరునామాలు, ఫోన్ నంబర్లు ఇస్తున్న విషయాన్ని అధికారులు మంత్రికి వివరించగా మంత్రి తీవ్రంగా స్పందించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రతి ప్రయాణికుడు ఖచ్చితమైన వివరాలు అందించాలని స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించి, ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి తదితర భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచ్‌ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, కేంద్ర ఆరోగ్యశాఖ, జీహెచ్‌ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 9, ప్రతినిధి: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఓబీసీ మోర్చా అధ్యక్షులు గంటసాల గోవిందరాజులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గీత కార్మికులు మరియు గౌడ సామాజిక వర్గాల ప్రత్యేకత, వారి జీవన విధానం, వృత్తి ప్రాముఖ్యతపై నాయకులు మీడియాతో మాట్లాడారు. గౌడ కులాలు ప్రధానంగా తాటి, ఈత చెట్ల నుంచి కల్లు గీయడం, బెల్లం తయారీ మరియు అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవించే వర్గమని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాంతాల వారీగా ఈడిగ, గౌడ, శెట్టిబలిజ, గమళ్ళ, గౌడ్, శ్రీశయన పేర్లతో పిలుస్తారని పేర్కొన్నారు. తాటి, ఈత చెట్ల నుంచి లభించే కల్లు సహజమైన పానీయమని, ఈ వృత్తి ప్రకృతితో ముడిపడి ఉన్న జీవనాధారమని వివరించారు. శ్రమజీవులైన ఈ సామాజిక వర్గానికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉందని, పల్లెటూరి సంస్కృతి మరియు ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్ర కీలకమని తెలిపారు. గౌడ వర్గాల ఆచారాలు, సంప్రదాయాలు ఎంతో పురాతనమైనవని, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే జాతరలు, ఉత్సవాల్లో వీరు ముందుండి పాల్గొంటారని, ప్రకృతిని ఆరాధించడం వీరి విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మరియు జనతా వారధి కన్వీనర్ మరే బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయి కుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్ బాబు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, బీజేపీ సీనియర్ నాయకులు దువ్వూరు సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు మరియు జనతా వారధి కో-కన్వీనర్ పెండెం శ్రీదేవి, యువమోర్చా అధ్యక్షులు పార్థసారధి, యువమోర్చా నాయకులు అరుణ, పేమ్మడి కుమార్, చెక్క చినబాబు, రాష్ట్ర మీడియా ఇంచార్జ్ యార్లగడ్డ రాంకుమార్, జిల్లా పీఆర్వో గంటసాల నాగరాజు తదితర కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.




## గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 9, స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లాలో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరూ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. ఈ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్ నుంచి సమర్థవంతమైన రక్షణ కల్పిస్తుందని, దీనిపై ఎలాంటి అపోహలు లేదా భయాందోళనలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలో అర్హులైన ప్రతి బాలికకు మిషన్ మోడ్‌లో వ్యాక్సినేషన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన ఈ వ్యాక్సిన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, టీవీవీపీ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలో 14-15 ఏళ్ల వయస్సు గల 12,635 మంది బాలికలు ఉండగా ఇప్పటివరకు 2,786 మంది మాత్రమే వ్యాక్సిన్ తీసుకున్నారని, మిగిలిన వారికి వ్యాక్సిన్ అందేలా విద్యాశాఖ, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచి వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ప్రజలు వైద్య నిపుణుల సూచనలు పాటిస్తూ ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాం సీల్స్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు మరియు ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ గఫార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కాకినాడ జిల్లాలో బీఎల్ఏ-1ల జాబితాను డీఆర్వోకు అందజేసిన బీజేపీ

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 9, ప్రతినిధి: నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ద్వారా, ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 21(3) ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి లభించిన అధికారాల మేరకు ఈ నెల 15 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభంకానున్న నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు సహకరించే నిమిత్తం భారతీయ జనతా పార్టీ బీఎల్ఏ-1లను నియమించి వారి జాబితాలను కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా డీఆర్వోకు అందజేసింది. జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ ఏజెంట్-1ల పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఎనిమిరెడ్డి మాలకొండయ్య కన్వీనర్‌గా, దువ్వూరి సుబ్రహ్మణ్యం, యార్లగడ్డ రామ్ కుమార్, దాట్ల సూర్యనారాయణ రాజు సభ్యులుగా వ్యవహరించనున్నారు. కాకినాడ నగర అసెంబ్లీ నియోజకవర్గానికి గట్టి సత్యనారాయణ, జగ్గంపేటకు కంబాల శ్రీనివాసరావు, తునికి వెలుగుల గోపాలకృష్ణ, కాకినాడ రూరల్‌కు చోడిశెట్టి రమేష్, పత్తిపాడుకు పైల సుభాష్ చంద్రబోస్, పెద్దాపురానికి చెరుకూరి రవి, పిఠాపురానికి గండి కొండలరావును బూత్ లెవెల్ ఏజెంట్-1లుగా పార్టీ నియమించింది. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం భారీ సంఖ్యలో పోలింగ్ బూత్‌లు ఉండగా, ఆయా ప్రాంతాల్లో బీఎల్ఏ-2లను నియమించి బూత్ స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనున్నారు. బీఎల్ఏ-2లు ప్రభుత్వ బీఎల్వోలతో కలిసి అర్హులైన ప్రతి ఓటర్‌ను జాబితాలో చేర్చడం, అనర్హులైన ఓటర్లను తొలగించడంలో సహకరించి ఓటర్ల జాబితా పారదర్శకతకు తోడ్పడతారని పార్టీ నాయకులు తెలిపారు.

## నర్సాపూర్‌లో కోతులు పట్టే కార్యక్రమం ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో కోతులు పట్టే ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజు లక్ష్మి యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా నర్సాపూర్ ప్రజలు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు నేడు కోతులు పట్టే కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయి కిరణ్, కౌన్సిలర్లు నీరంజన్, శ్రీకాంత్, సుధీర్, పంబల్ల లలితా, బిక్షపతి, సరళ, ఆంజనేయులు గౌడ్, సమీనా, షేక్ హుస్సేన్, ఖండేలా రాజు, ప్యాక్స్ చైర్మన్ రాజు యాదవ్, మున్సిపల్ మేనేజర్ మసూద్, జేమ్స్, సల్ల మురళి, శ్రీనివాస్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లి కొట్యాల్ ఏరియాలో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జీజీహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ షర్మిల, జీజీహెచ్ఎస్ ఆర్ఎంఓ రేవతి, డీసీహెచ్ఎస్ శివదయాల్, ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, హెచ్‌వోడి జనరల్ మెడిసిన్ డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ రాజేశ్వరి, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ పావని, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బోస్ రాజశేఖర్, బోని, కౌన్సిలర్ విశ్వం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కేంద్రం అభివృద్ధి పనులకు అవసరమైన బడ్జెట్ కేటాయింపుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి మౌలిక వసతులు, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ సేవలు తదితర అంశాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, భద్రతా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రజా ప్రయోజనకరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ సభలు ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదిక జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: గ్రామాల్లో ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం, కాలుష్య నియంత్రణ, సురక్షిత తాగునీటి నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్నల కొనుగోలులో రాష్ట్రంలో అగ్రగామిగా చింతకాని మండలం





సందేశం టైమ్స్, చింతకాని ప్రతినిధి, జూన్ 9: నాగులవంచ సహకార సంఘం అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు హాజరై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు నాయకులు, రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో మొట్టమొదటిగా చింతకాని మండలంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అంచనాలకు మించి పంట దిగుబడులు రావడం, గోదాముల కొరత, హమాలీల సమస్య, లారీలు అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులను అధిగమిస్తూ ప్రభుత్వం అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. నాగులవంచ, చింతకాని సహకార సంఘాలు మొక్కజొన్నల కొనుగోలులో రాష్ట్రంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. చింతకాని సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి శేఖర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు, నాగులవంచ సహకార సంఘం అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు, సీఈఓ శ్రీనివాసరావులను అభినందించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతన్నలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక శాసనసభ్యులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చింతకాని మండలంలో మొత్తం 9,450 మంది రైతుల నుంచి 6,66,330 క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు చెల్లించవలసిన మొత్తం రూ.159,91,92,000లను సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ సర్పంచ్ నారగాని రాంబాయి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, అబ్దుల్ నబీ, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మాజీ ఎంపీటీసీ బొర్ర ప్రసాదరావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచమూర్తి రామకృష్ణ, నాయకులు ఆలస్యం బసవయ్య, ఎల్లంపల్లి నాగేశ్వరరావు, అంబటి శాంతయ్య, మద్దినేని నాగేశ్వరరావు, బొర్ర లక్ష్మీనారాయణ, సామినేని నాగ శ్రీనివాసరావు, బండ్లమూడి రామరావు, దండ హరీష్, తాత సుధాకర్, సామినేని వెంకటనర్సయ్య, ఆళ్ల శ్రీనివాసరావు, మద్దినేని వెంకటేశ్వర్లు, ఆళ్ల అజయ్, అధికారులు, సొసైటీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణిలో పెన్షన్లకు సంబంధించి 15, భూభారతి 24, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన 15, ఇతర సమస్యలకు సంబంధించిన 40 దరఖాస్తులు సహా మొత్తం 94 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజలు సుదూర ప్రాంతాల నుండి వచ్చి సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి సుదర్శన మహా యాగంలో పాల్గొన్న గుల్జపు సుశీల, అంజయ్య



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, జూన్ 9, నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి సుదర్శన మహా యాగ మహోత్సవం భక్తజనుల రద్దీతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ మహోత్సవంలో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుల్జపు మచ్చేందర్ తల్లిదండ్రులు, కల్హేర్ మండల మాజీ ఎంపీపీ గుల్జపు సుశీల, అంజయ్య దంపతులు ప్రత్యేకంగా పాల్గొని యాగశాలలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన వారు శ్రీలక్ష్మి సుదర్శన స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. యాగ మహోత్సవం విజయవంతంగా కొనసాగి సమాజంలో ధార్మిక చైతన్యం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యాగ నిర్వాహకులు గుల్జపు సుశీల, అంజయ్య దంపతులను ఘనంగా ఆహ్వానించి సత్కరించారు. వారి రాకతో మహోత్సవానికి మరింత ప్రత్యేకత చేకూరిందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగ మహోత్సవాన్ని విజయవంతం చేస్తున్నారు. ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, ధార్మిక విలువలను ప్రజల్లో పెంపొందించే ఇటువంటి యాగ మహోత్సవాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని గుల్జపు సుశీల, అంజయ్య దంపతులు పేర్కొన్నారు.

## వివాహేతర సంబంధం నేపథ్యంలో ఆర్మీ జవాన్ హత్య



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 9: మెదక్ పట్టణంలో ఆర్మీ ఉద్యోగి దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో పొన్నం కుమార్‌ను భార్య, అత్తమామలు, బావమరిది కలిసి తీవ్రంగా కొట్టి హత్య చేసినట్లు సమాచారం. ఇంట్లో ఇద్దరు ఏకాంతంగా ఉండగా భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు కుమార్‌పై దాడి చేసి హత్య చేసిన అనంతరం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. మృతుడు పొన్నం కుమార్ ఉత్తరాఖండ్‌లో ఆర్మీ విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం సెలవులపై స్వగ్రామానికి వచ్చిన ఆయన ఈ నెల 10న తిరిగి విధులకు వెళ్లాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకోవడం విషాదకరం. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 79 ఫిర్యాదుల స్వీకరణ సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు





సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 9, ప్రతినిధి: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ మొత్తం 79 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో భూ తగాదాలకు సంబంధించినవి 26, కుటుంబ కలహాలకు సంబంధించినవి 25, ఇతర విభాగాలకు చెందినవి 28 ఫిర్యాదులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఉద్దేశించి ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపడంతో పాటు పూర్తి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.




## జూన్ 20న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి — ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 9, స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్: ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని, అనవసర వివాదాలకు దూరంగా ఉండి సామరస్యపూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. జిల్లాలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను పరస్పర అవగాహనతో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో రాజీ కుదుర్చుకోవచ్చున్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వేగవంతమైన, సులభమైన, సామరస్యపూర్వక న్యాయం అందుబాటులోకి వస్తుందని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షుడు కర్చర్ల అశోక్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



సందేశం టైమ్స్, వట్పల్లి, జూన్ 09, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలో భారతీయ జనతా పార్టీ వట్పల్లి మండల అధ్యక్షుడు కర్చర్ల అశోక్ కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని అశోక్ కుమార్ దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కర్చర్ల అశోక్ కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యసభ నామినేషన్లలో శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా తెదేపా అధ్యక్షులు జ్యోతుల నవీన్ - అభ్యర్థులకు ఘన సత్కారం



సందేశం టైమ్స్, కాకినాడ జిల్లా, జగ్గంపేట/అమరావతి, జూన్ 09, ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్ కార్యక్రమంలో శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. అమరావతి చేరుకున్న వీరు ముందుగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ, కాకినాడ నగర, రూరల్ శాసనసభ సభ్యులు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, కాకినాడ రూరల్, పిఠాపురం మాజీ శాసనసభ సభ్యులు పిల్లి అనంతలక్ష్మి, ఎస్వీఎస్ఎన్ వర్మ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ తో కలిసి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభకు నామినేషన్ వేసిన ముగ్గురు అభ్యర్థులకు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ అభినందనలు తెలియజేసి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభలో గళం వినిపిస్తారని ఆకాంక్షించారు.

# మాట తప్పిన కంపెనీ యాజమాన్యం – ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగం ఇవ్వాలని వినతి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 09, ప్రతినిధి: పుల్కల్ మండలం చౌటకూర్ గ్రామ పరిధిలోని ఎంపీ డిస్టిలరీస్ లిమిటెడ్ కంపెనీలో లేబర్ వర్కర్‌గా పనిచేస్తూ ప్రమాదంలో మరణించిన తన తండ్రికి ఇచ్చిన హామీ ప్రకారం శాశ్వత ఉద్యోగం కల్పించాలని పల్లె ప్రభు గౌడ్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తన తండ్రి కిష్టయ్య పని చేస్తుండగా బియ్యం సంచులు పడటంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 16-02-2022న మరణించారని తెలిపారు. అప్పట్లో కంపెనీ యాజమాన్యం తమ కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిందని, వయస్సు పరిమితి కారణంగా అప్పట్లో ఇవ్వలేదని, ఐటీఐ పూర్తి చేసిన తర్వాత శాశ్వత ఉద్యోగం ఇస్తామని స్పష్టంగా మాట ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కంపెనీ యాజమాన్యం ఉద్యోగం ఇవ్వడం కుదరదని నిరాకరిస్తోందని, దీంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తూ, కలెక్టర్ జోక్యం చేసుకుని ఇచ్చిన హామీ ప్రకారం తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం – మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా, కూసుమంచి, జూన్ 09, ప్రతినిధి: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని, కేవలం మంజూరుతోనే బాధ్యత ముగియదని, నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాజుపేటలో నాలుగు ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని, గట్టు సింగారంలో 19 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికే 10 పూర్తయినట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇళ్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తొలకరి జల్లులతో రైతుల్లో కొత్త ఆశలు – జహీరాబాద్ నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్, జహీరాబాద్/న్యాల్కల్, జూన్ 09, ప్రతినిధి: నైరుతి రుతుపవనాల రాకకు ముందే కురిసిన తొలకరి జల్లులు రైతుల్లో కొత్త ఆశలను నింపాయి. వర్షాలు పూర్తిస్థాయిలో కురిసిన తర్వాతే విత్తనాలు వేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తున్నప్పటికీ, జహీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే ఖరీఫ్ సాగు పనులను ప్రారంభించారు. న్యాల్కల్, జహీరాబాద్, నారాయణఖేడ్, రాయికోడ్, మానూర్ మండలాల్లో రైతులు ప్రధానంగా పత్తి, కంది పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. గత కొన్నేళ్లుగా జూన్, జూలై నెలల్లో అనుకూల వర్షాలు కురవడంతో ఈ ఏడాది కూడా మంచి వర్షాలు కురుస్తాయనే విశ్వాసంతో విత్తనాలు నాటుతున్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో సుమారు 7.65 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉండగా, అందులో అధికంగా పత్తి, కంది పంటలే సాగు కానున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పొలాల దున్నకం, విత్తనాల సిద్ధం, ఎరువుల సేకరణ వంటి వ్యవసాయ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, రైతులు ఆశావహ దృక్పథంతో సాగు పనులు కొనసాగిస్తూ ఈ సీజన్‌లో మంచి దిగుబడులు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి – ఏపీఎస్ఈఆర్ఎంసీ తక్షణ పునరుద్ధరణకు పీఏఏపీ డిమాండ్

సందేశం టైమ్స్, విజయవాడ, జూన్ 09, ప్రతినిధి: కొత్త విద్యాసంవత్సరం 2026–27 ప్రారంభమైన తరుణంలో రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని "ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" (పీఏఏపీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిఖరం నరహరి, జీ. ఈశ్వరయ్య విజయవాడలో విడుదల చేసిన ప్రకటనలో, విద్యా రంగంలో ఫీజుల నియంత్రణ కోసం ఏర్పాటైన "ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్" (ఏపీఎస్ఈఆర్ఎంసీ) పూర్తిస్థాయి చైర్మన్, సభ్యుల నియామకం లేక నిష్క్రియాత్మకంగా మారిందని ఆరోపించారు.కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించి పూర్తి అధికారాలు కల్పించాలని, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయడం, అధిక ధరలకు పుస్తకాలు మరియు యూనిఫామ్‌ల విక్రయం వంటి అక్రమాలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే హైకోర్టు ఉత్తర్వులు మరియు ప్రభుత్వ జీవోలను కఠినంగా అమలు చేయాలని కోరారు.ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో తాత్కాలిక ఫిర్యాదు పరిష్కార కేంద్రాలు ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచిస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని పీఏఏపీ నాయకులు హెచ్చరించారు.

# జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి – చివరి దశలో కొనుగోలు ప్రక్రియ



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 09, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు 95 శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె, చివరి దశలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 82,251 మంది రైతుల నుంచి 3,80,358.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 65,394 మంది రైతులకు 694.32 కోట్ల రూపాయల చెల్లింపులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 268 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు ఆమె తెలిపారు. కొనుగోలు పూర్తయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు, హమాలీలను ప్రస్తుతం కొనుగోళ్లు కొనసాగుతున్న కేంద్రాలకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, సివిల్ సప్లై శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ధాన్యం సేకరణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని సొసైటీ సీఈఓ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 09, ప్రతినిధి: చింతకాని మండల కేంద్రంలోని సహకార సంఘం ద్వారా దాదాపు 9 లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి, కాటా వేసి లారీల ద్వారా గోదాములకు సమయానుకూలంగా తరలించిన సందర్భంగా సొసైటీ సీఈఓ శ్రీనివాస్‌ను మండల నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. రైతుల వద్ద నుంచి సేకరించిన ప్రతి ధాన్య గింజను సమర్థవంతంగా గోదాములకు తరలించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, తీవ్ర ఒత్తిడిలోనూ సేవలందించిన సీఈఓ శ్రీనివాస్ పనితీరును నాయకులు ప్రశంసించారు. రైతుల ముసుగులో కొంతమంది నాయకులు ఆటంకాలు సృష్టించినప్పటికీ వెనకడుగు వేయకుండా రైతుల ప్రయోజనాల కోసం కృషి చేసిన ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రైతుల చైర్మన్ శేఖర్ రెడ్డి, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, మండల అధ్యక్షులు కొల్లి గోవిందరావు, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, నాన్నక కోటయ్యతో పాటు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు తో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో కలెక్టరేట్‌లో 27, సంగారెడ్డి డివిజన్‌లో 17, ఆందోల్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్ డివిజన్‌లో 11, జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు నమోదైనట్లు వెల్లడించారు. అంతకుముందు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో దాని ప్రాధాన్యత, అలాగే అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.